

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: నిత్యాన్నదానానికి తమిళనాడుకు చెందిన జె.శివకుమార్, కలై సెల్వి, గిరిజా అరంగార్, ఎస్‌జీ మహావిష్ణు దంపతులు చెరో రూ.లక్ష విరాళం అందించారు.



సర్వపాపహరణం.. సింధుస్నానం

హంసలదీవి క్షేత్రం సింధుస్నానాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. -8లో▸



విద్యారణ్య భారతిస్వామి పూజలు

నందిగామ టౌన్:నందిగామంలోని రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవంలో హంపి విరూపాక్షి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ పాల్గొని పూజలు చేశారు.

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్ హెల్త్ వర్సిటీ క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: అంతర్ యూనివర్సిటీ రోలర్ స్కేటింగ్, రోలర్‌హాకీ, ఇన్‌లైన్ హాకీ స్త్రీ, పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ జట్లను ఈ నెల ఆరోవ తేదీన ఎంపిక చేస్తున్నట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తులు తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని, ఫిజియోథెరఫి, నర్సింగ్, ఎంఎల్‌టీ కాలేజీల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. ఆయా క్రీడాంశాల్లో యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు.

98.84 శాతం పింఛన్లు పంపిణీ



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక పథకం ద్వారా నాల్గవ రోజైన శనివారం వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 2,38,123 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా 2,34,711 మందికి పింఛన్లు అందజేసి 98.58 శాతం సాధించారు. మచిలీపట్నం మండలం, పెదపారుపూడి, పెడన అర్బన్ ప్రాంతాలు పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాలు సాధించాయి.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక నాలుగు రోజుల్లో 98.84 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో మొత్తం 2,30,070 మందికి గాను 2,27,402 మందికి పింఛన్లు అందించారు. అత్యధికంగా జి కొండూరు మండలంలో 99.36 శాతం, రెడ్డి గూడెంలో 99.1 శాతం, నందిగామలో 98.87 శాతం పూర్తయింది.

ఖేలో ఇండియా పోటీల్లో రాష్ట్ర జట్లు సత్తా



విజయవాడ స్పోర్ట్స్: ఖేలో ఇండియా యూత్ జాతీయ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర జట్లు సత్తా చాటాయి. భోపాల్‌లోని టీటీ నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన బాక్సింగ్ బాలుర విభాగం పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుడు ఎం.అంజనికుమార్, బాలికల విభాగం పోటీల్లో మెహరున్నీసాబేగం బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. షూటింగ్‌లో ముఖేష్ గోల్డ్ మెడల్ సాధించగా, బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో తమిళనాడు జట్టును 21-15, 21-12 తేడాతో ఓడించి రాష్ట్ర జట్టు (నవ్య, జాహ్నవి) గోల్డ్‌మెడల్‌ను సాధించారు.

రేపటి నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కురుమద్దాలి(పామర్రు): నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలోని రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హబ్‌లో డొమెస్టిక్ ఎంట్రీ ఆపరేటర్ అనే కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అభ్యర్థులకు 3 నెలలపాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కోర్సుకు 10వ తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఇరిగేషన్ భూమి కబ్జా !

- రెండెకరాల భూమి ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి
- దాని విలువ రూ.2 కోట్లు
- ఎకరం భూమిలో రాత్రికి రాత్రే రోడ్డు నిర్మాణం
- అభ్యంతరం వ్యక్తం చేసిన అధికారులు
- నోటీసులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం రోడ్డు పక్కన ప్రభుత్వ భూమి ఆక్రమించి వెంచర్ కోసం ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ భూములపై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. ఎంచక్కా కబ్జా చేసేందుకు సిద్ధమవుతున్నారు. విజయవాడ నగరానికి అతి సమీపంలోనే ఇబ్రహీంపట్నం ఉంది. ఆ ప్రాంతంలో భూములకు గిరాకీ ఉంది. ధరలు సైతం అమాంతంగా పెరిగాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల చూపు ప్రభుత్వ భూములపై పడింది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. స్థానిక పవిత్ర సంగమం రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న సుమారు రూ.2 కోట్లు విలువైన 2 ఎకరాల నీటి పారుదల శాఖ భూమిని ఓ ప్రైవేట్ వెంచర్ యజమాని కబ్జా చేసి ఏకంగా రోడ్డు నిర్మాణం చేపట్టాడు. ఆక్రమణ విషయం తెలుసుకున్న అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ అధికారులు రోడ్డు ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ వెంచర్ యజమానికి నోటీసులు జారీ చేశారు.

ప్రభుత్వ భూమిలో రోడ్డు, మెరక పనులు....

సంగమం రోడ్డు సమీపంలో వెంచర్‌దారులు తూర్పువైపు రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వ భూమి నొక్కేసేందుకు ప్రణాళికలు రచించారు. రోడ్డుకు వెంచర్‌కు మధ్య సమాంతరంగా ఉన్న సుమారు 30 నుంచి 40 అడుగుల వెడల్పు గల ప్రభుత్వ భూమిలో కొంతమేర రోడ్డు, కొంత మెరక పనులు చేపట్టారు. వాహనాలు వెళ్లేందుకు రోడ్డు పక్కన ఐరన్ బారికేడ్లు తొలగించారు. గ్రీనరీ మొక్కలు నరికేసి రోడ్డుపై వేశారు. సుమారు రూ.2 కోట్లు విలువైన భూమి కబ్జాకు గురికావడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. స్థలం కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

లోపాలతోనే ప్లాట్ల విక్రయాలు....

పవిత్రసంగమం రోడ్డు సమీపంలో సర్వే నెంబర్ 211/ఎ, 212/2, 2ఎ లో సుమారు 10 ఎకరాల వెంచర్‌లో 86 ప్లాట్లు ఏర్పాటు చేశారు. సీఆర్‌డీఏ లేఅవుట్ నెంబర్‌తో ప్లాట్లు విక్రయించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు ఉద్యోగులకు లేఅవుట్‌లో ఉన్న లోపాలతో బ్యాంక్ లోను మంజూరు కావడం లేదు. ఈ పరిణామాలతో ప్లాట్లు కొన్నవారు తాము కట్టిన నగదు తిరిగి ఇచ్చేయాలని యజమానులపై ఒత్తిడి పెంచారు. కొనుగోలు దారులకు ఇప్పటికీ లేఅవుట్ ప్లాన్ నెంబర్ తప్ప ప్లాన్ అప్రూవల్ చూపించలేదని చెబుతున్నారు.



ప్రభుత్వ భూమి ఆక్రమించి రోడ్డు వేసిన లేఅవుట్

18 ఎకరాల నీటిపారుదల శాఖ స్థలం...

బుడమేరు కరకట్టపై నీటిపారుదల శాఖకు చెందిన సర్వే నెంబర్ 206లో సుమారు 18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 2016కు ముందు ఆ స్థలంలో 300 మంది పేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉన్నారు. 2016 కృష్ణానది పుష్కరాల సమయంలో పేదల ఇళ్లు తొలగించారు. 18 ఎకరాల భూమిలో సుమారు 13 ఎకరాల్లో 1.70 కిలోమీటర్ల పొడవున డబుల్ లేన్ రోడ్డు ఏర్పాటు చేశారు. రోడ్డు స్థలం పోగా మిగిలిన సుమారు 5 ఎకరాల భూమి రోడ్డు పక్కన ఖాళీగా వదిలేశారు. వెంచర్‌కు సమాంతరంగా ఉన్న ప్రభుత్వ భూమిని వెంచర్ తూర్పు రోడ్డుగా మార్చేందుకు ఆక్రమించారు.

భూమి స్వాధీనం చేసుకుంటాం



పవిత్ర సంగమం రోడ్డు పక్కన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తెలిసింది. రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని చెప్పాం. సీఆర్‌డీఏ అప్రూవల్ ప్లాన్, ప్రభుత్వ భూమి ఆక్రమణకు మీ వద్ద గల ఆధారాలతో సోమవారం హాజరుకావాలని నోటీసు ఇచ్చాం. ఆధారాలు పరిశీలించి భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– పర్వతనేని శ్రీధర్, మున్సిపల్ కమిషనర్, కొండపల్లి

ప్రజలను మోసం చేస్తున్నారు



పట్టణం మధ్యలో వెంచర్ ఉందని మా బంధువులు ప్లాట్లు కొనుగోలు చేశారు. వారికి లోన్ మంజూరు కాదని బ్యాంక్ అధికారులు చెప్పారు. సీఆర్‌డీఏ అప్రూవల్ ఉందోలేదో తెలియడం లేదు. అనేక మంది కట్టిన నగదు తిరిగి ఇచ్చేయాలని కోరుతున్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారు.

– రాయపూడి వెంకటరావు, మాజీ వార్డు సభ్యుడు, ఇబ్రహీంపట్నం

త్వరలో రెండు జిల్లాల ప్రజల కల సాకారం

- ముక్త్యాల కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం
- 15 ఏళ్ల కల నెరవేర్చిన సీఎం జగన్



బ్రిడ్జి నమూనా వివరాలు అడిగి తెలుసుకుంటున్న విప్ ఉదయభాను

ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామంలో కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణంతో ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల ప్రజల కల త్వరలోనే సాకారమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. గ్రామంలోని కృష్ణానది వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఆర్వి అసోసియేట్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రిల్లింగ్, మట్టి నమూనా సేకరణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను విలేకర్లతో మాట్లాడుతూ 15 ఏళ్ల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణమైతే రెండు జిల్లాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, ప్రయాణికులు, విద్యార్థులు పట్టణ ప్రాంతానికి రావాలంటే నదిలో పడవలు, బల్లకట్టులే ఆధారమని దీంతో అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ముఖ్యంగా రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకునేందుకు బ్రిడ్జి లేకపోవటంతో చాలా అసౌకర్యానికి గురయ్యారని గుర్తు చేశారు. జనం అవస్థలను తనతో పాటు పల్నాడు జిల్లా పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరి శంకరరావు కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో వెంటనే స్పందించిన సీఎం రూ. 60 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల రెండు జిల్లాల ప్రజలకు 70 కి.మీల మేర దూరం తగ్గుతుందని వెల్లడించారు. సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. 450 మీటర్ల పొడవున 14 పిల్లర్‌లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రాథమిక సర్వే చేశారని వివరించారు. జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు వచ్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు షాఉద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, గ్రామ నాయకులు దాది బ్రహ్మం, నరసయ్య, యండ్రాతి రవికుమార్, ప్రతినిధి భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సలపై ప్రత్యేక శ్రద్ధ

- రూ.400 కోట్లతో 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో క్యాన్సర్ చికిత్సలు
- వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు
- విజయవాడలో ఏఓఐ ఆధ్వర్యంలో 5కే వాక్‌థాన్



5కే వాక్‌థాన్ జెండా ఊపి ప్రారంభిస్తున్న హెల్త్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్ నివారణ, చికిత్స అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 5కే వాక్‌థాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఊపి వాక్‌థాన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల కిందట సాంక్రమిక వ్యాధులతో ప్రజలు ఎక్కువగా మరణించే వారని తెలిపారు. మారిన జీవనశైలి పరిస్థితుల్లో ఇప్పుడు అసాంక్రమిక వ్యాధుల కారణంగా ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారనే విషయాన్ని గమనించాలని చెప్పారు. సాంక్రమిక వ్యాధులకు సంబంధించి అత్యాధునిక వైద్య చికిత్సలు, మందులు అందుబాటులోకి రావడంతో ఆ మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు కారణంగా సోకుతున్న క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులతో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. 20 ఏళ్ల కిందట ఈ మరణాల సంఖ్య 30 శాతం లోపు ఉండగా, ఇప్పుడు 60 శాతానికి పైగా పెరిగినట్లు వెల్లడించారు.

జీవనశైలి మార్పే ప్రధాన కారణం...

అందుకు ముఖ్యంగా జన్యుపరమైన కారణాలు కంటే మన జీవనశైలిలో మార్పే కారణమని వివరించారు. ప్రాణాంతకమైన అలవాట్ల వలన నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటికి ఎక్కువగా గురవుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ కారణంగా 9 శాతం మంది మరణిస్తున్నారని తాజా అంచనాలు చెపుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో ఏటా దాదాపు 35 వేల మందికి పైగా క్యాన్సర్ బారిన పడి మరణిస్తున్నట్లు తెలిపారు. మరో 70 వేల మంది కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గత ఏడాది క్యాన్సర్ చికిత్సకు రూ. 430 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధి నివారణకు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రధాన వ్యాధిగా చేర్చి అనేక వైద్య విధానాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్టేజ్ 1 నుంచి 4 వరకూ పాలియేటివ్ కేర్ వంటి వైద్య విధానాలు అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు వ్యాధి బారి నుంచి సాంత్వన కలిగించే ప్రయత్నం చేశామన్నారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్పష్టం చేశారు. క్యాన్సర్ చికిత్సలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడును ప్రభుత్వ సలహాదారునిగా నియమించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 11 వైద్య కళాశాలలో క్యాన్సర్ చికిత్సకు రూ.400 కోట్లుతో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుబ్బారావు, డాక్టర్ రాజేష్ కోట తదితరులున్నారు.

తిరుపతమ్మ కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం



విద్యుద్దీపాల వెలుగుల్లో పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం

- నేటి నుంచి పెనుగంచిప్రోలు పెద్ద తిరునాళ్ల
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

పెనుగంచిప్రోలు: నేటి నుంచి ప్రారంభమయ్యే తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించేందుకు ఆలయ ఈవో జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, పాలకవర్గ సభ్యులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో అలంకరించారు. ఆదివారం రాత్రి నిర్వహించే అమ్మవారి కల్యాణానికి 80 అడుగుల భారీ కల్యాణ వేదికను తెలంగాణ ప్రాంతానికి చెందిన కళాకారులతో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దంపతులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కల్యాణోత్సవానికి హాజరవుతారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తులు దూరం నుంచి చూసేందుకు వీలుగా కల్యాణ మండపం వద్ద, గ్రామంలో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం చుట్టూ ఎల్ఈడీ స్క్రీన్‌లు అమర్చుతున్నారు. కల్యాణం రోజు ఉదయం నుంచి దీక్షా స్వాములు తిరుముడి సమర్పిస్తారని, ఫిబ్రవరి 6 న మధ్యాహ్నం జలబిందెలు, 7 న ఉదయం ఉదయపొంగళ్లు, అంకసేవ, 8 న దీవెన బండారు, బోనాలు, ఫిబ్రవరి 9 న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ తెలిపారు. స్వాములు దీక్ష విరమించి తిరుముడి సమర్పించేందుకు భక్తులు కాలినడకన పెనుగంచిప్రోలుకు చేరుకుంటున్నారు. దీక్షా స్వాముల ఉచిత భోజనానికై మునేరు అవతల అమ్మవారి ఆలయానికి చెందిన ఆడిటోరియం స్థలంలో భోజన ఏర్పాట్లకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. కల్యాణ వేదిక స్థలంలో గత మూడు రోజులుగా జరుగుతున్న స్థలశుద్ధి పూజలు శనివారంతో ముగిశాయి. ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక శిబిరాలు

కలెక్టర్ రంజిత్‌బాషా



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఆరు కేంద్రాల్లో ఈ శిబిరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు కేటాయించి 10 సంవత్సరాలు పూర్తయిన వారికి డాక్యుమెంట్ అప్‌డేట్, 5, 15 సంవత్సరాల వయసు దాటిన పిల్లలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తామని చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం, బంటుమిల్లి తపాలా కార్యాలయాల్లో కేంద్రాలు నెలకొల్పామన్నారు. మొబైల్, డాక్యుమెంట్ అప్‌డేట్‌లకు రూ. 50, బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ. 100 రుసుం చెల్లించాలని స్పష్టం చేశారు. 5, 15 సంవత్సరాలు దాటిన పిల్లలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ఉచితంగా సేవలు పొందవచ్చన్నారు. ఆధార్‌ను తిరిగి ధ్రువీకరించుకునేందుకు గుర్తింపు, చిరునామా పత్రాలను సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆధార్ కేంద్రాల వద్ద తగిన ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి యున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుడు రూ. 1,00,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు శనివారం తెలిపారు. ఖమ్మం జిల్లా చెరువుమాధవరం గ్రామానికి చెందిన నెలకుర్తి మంగిరెడ్డి దంపతులు విరాళాన్ని అందించారని తెలిపారు. దాతలకు స్వామి వారి చిత్ర పటం, ప్రసాదాలు అందజేశారు.



విరాళమందిస్తున్న దాత

‘సైక్లింగ్’ ఎంపికల ట్రయల్స్‌కు స్పందన



వికాస్ కాలేజీ రోడ్డులో సైక్లింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న సత్యనారాయణరెడ్డి

నున్న(విజయవాడరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) కృష్ణా జిల్లా యూనిట్ ఆధ్వర్యాన నున్న వికాస్ కాలేజీ రోడ్డులో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ సైక్లింగ్ ఎంపిక ట్రయల్స్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. వీటిని వికాస్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ఎస్‌జీఎఫ్ ప్రోత్సహిస్తోందన్నారు. ఫెడరేషన్ అండర్-14, 17 కార్యదర్శి తోట అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో అండర్- 17, 19 బాలబాలికల అంతర్ జిల్లా సైక్లింగ్ చాంపియన్‌షిప్, 16,17 తేదీల్లో అండర్14 చాంపియన్ షిప్‌ను నరసరావుపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శన ఆధారంగా కృష్ణా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించే బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ ప్రధాన కార్యదర్శి సుగుణరావు, వికాస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ఎంవీ సత్యప్రసాద్, టి.శ్రీలత, ఎం.వెంకటేశ్వరావు, విజయవర్మ, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట్రావు

కంచికచర్ల: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం వీరులపాడు మండలం తాటిగుమ్మి గ్రామానికి చెందిన మందా వెంకట్రావు(29) ఎలక్ట్రీషియన్. అతనితో పాటు మరొక వ్యక్తి కంచికచర్లలో ఎలక్ట్రికల్ సామగ్రి కొనుగోలు చేసి స్నేహితులను కలవడానికి శుక్రవారం రాత్రి పరిటాలకు బైక్‌పై బయలుదేరారు. ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. ఘటనలో వెంకట్రావుతో పాటు మరొక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట్రావు మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి

- ధాన్యం కొనుగోలులో ఇబ్బంది రాకుండా చూడండి
- స్థాయీ సంఘ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైస్‌చైర్మన్ గరికపాటి శ్రీదేవి, సభ్యులు, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. ఆమె చాంబర్‌లో శనివారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. తొలుత గ్రామీణాభివృద్ధి స్థాయి సంఘ సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ గృహ నిర్మాణం, ఉపాధి హామీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేదలకు సొంతింటి కలను నెరవేర్చడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారన్నారు. వైఎస్సార్ పింఛను కానుక ద్వారా జిల్లాలో 2,38,862 మందికి రూ. 65.61 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా జిల్లాలో 54 లక్షల పని దినాలు కల్పించి కనీస వేతనం రూ. 236 అందిస్తున్నామని వివరించారు. వచ్చే వేసవిలో చెరువులు, పంటకాల్వలు, బోదెల పూడికతీత పనులు ముమ్మరంగా చేయాలని, ఎక్కువ మందికి పనులు కల్పించాలని చైర్‌పర్సన్ అధికారులకు సూచించారు. పరిశ్రమలశాఖలో.. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం ద్వారా పరిశ్రమల స్థాపనకు నిరుద్యోగ యువకులు, ఔత్సాహికులు దరఖాస్తు చేసుకుంటే రూ. 50 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించనున్నామని తెలిపారు. సమావేశాలకు పరిశ్రమలశాఖ నుంచి కృష్ణ, ఏలూరు జిల్లాల నుంచి అధికారులు రాకపోవడంతో చైర్‌పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సీఈఓకు సూచించారు.

రైతులు నష్టపోకుండా చర్యలు

వైస్‌చైర్మన్ గరికపాటి శ్రీదేవి అధ్యక్షతన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్బీకేల్లో, మిల్లుల వద్ద తేమశాతంలో వ్యత్యాసాలు ఉంటున్నాయని రైతులు నష్ట పోతున్నారని ఇలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అర్హులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాలని తెలిపారు. రైతు గ్రూపులకు డ్రోన్‌లు అందించే కార్యక్రమంలో రైతులకు పాస్‌పోర్టు ఉండాలనే నిబంధనను తొలగించేలా చూడాలన్నారు.

‘పది’లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

విద్య, వైద్యం స్థాయి సంఘ సమావేశంలో 10వ తరగతి పరీక్షల విషయంపై ఆరా తీశారు. గతంలో కంటే జిల్లాలో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో రోగుల వద్ద లంచాలు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఇలాంటివి జరగకుండా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. కంటి శస్త్ర చికిత్సల్లో జాప్యం జరగకుండా వెంటనే ఆపరేషన్లు చేయాలని చెప్పారు. వైస్‌చైర్మన్ గుదిమళ్ల కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సాంఘిక సంక్షేమ సమావేశంలో అర్హులకు కచ్చితంగా పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమం, పనులు, ఆర్థిక, ప్లానింగ్ సమావేశాలను చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో చేయాల్సిన అభివృద్ధి పనులు, ఇతర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటిని త్వరితగతిన నిర్మించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో జి. శ్రీనివాసరావు, కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు, స్థాయి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక డైలీ ప్యాసింజర్ సర్వీసులు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రాజమండ్రి-విశాఖపట్నం మధ్య 07466 నంబరు రైలు ఈ నెల 14 నుంచి రోజూ నడుస్తుందని తెలిపారు. ఈ రైలు ఉదయం 9.20 గంటలకు రాజమండ్రిలో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07467 నంబరుతో ఈ నెల 15 నుంచి రోజు సాయంత్రం 6.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, రాత్రి 11.35 గంటలకు రాజమండ్రి చేరుకుంటుంది. విశాఖపట్నం - విజయనగరం మధ్య 07468 నంబరు ఈ నెల 14 నుంచి రోజూ సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, రాత్రి 7.50కి విజయనగరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07469 నంబరుతో ఈ నెల 15 నుంచి ఉదయం 6.10 గంటలకు విజయనగరంలో బయలుదేరి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-పలాస మధ్య 07470 నంబరు రైలు ఈ నెల 14 నుంచి రోజూ ఉదయం 7.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు పలాస చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07471 నంబరుతో మధ్యాహ్నం 1.30 గంటలకు పలాసలో బయలుదేరి, రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గూడ్స్ రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో రామవరప్పాడు-విజయవాడ నార్త్ క్యాబిన్ వద్ద సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని మహిళ గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై గూడ్స్ గార్డ్ ఇచ్చిన సమాచారం మేరకు స్టేషన్ సూపరింటెండెంట్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఆచూకి తెలిసిన వారు విజయవాడ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

- నేడు హంసలదీవి సాగరతీరంలోస్నానాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- రెండు లక్షల మంది యాత్రికులు తరలివచ్చే అవకాశం

సర్వపాపహరణం.. సింధూ స్నానం



సాగరసంగమం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కోడూరు(అవనిగడ్డ): హంసలదీవి క్షేత్రం సింధుస్నానాలకు ముస్తాబైంది. కృష్ణా నది, సాగర సంగమ ప్రాంతంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు స్నానాలు చేసేందుకు అవకాశం కల్పించారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకొని సింధుస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలూ కలగకుండా జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సాగర సంగమం వద్ద పటిష్టమైన బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. పర్యాటకుల భద్రత కోసం ఐదు మరబోట్లు, 40 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. కోడూరు, మందపాకల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఇప్పటికే నాలుగు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, 108 వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తీరం ఒడ్డున ఆరు తాత్కాలిక మరుగుదొడ్లను కూడా నిర్మించారు. 300 మంది పంచాయతీ కార్మికులు ఇప్పటికే తీరంలో పారిశుద్ధ్య పనులు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మహబుబ్ బాషా పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 300 మంది పోలీసులు, 90 మంది మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు చేపడుతున్నారు. సింధుస్నానాలకు వచ్చే యాత్రికుల కోసం అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి హంసలదీవి స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది.

రెండు లక్షల మంది వచ్చే అవకాశం

సింధుస్నానాలకు రెండు లక్షల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బందరు డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరేవతి, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం శనివారం సాగరతీరంలో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజున సముద్రంలో నది కలిసే ప్రాంతంలో స్నానమాచరించడాన్నే సింధుస్నానం అంటారు. సూర్యుడు మకరరాశిలో ఉండగా పౌర్ణమి రోజున ప్రసరించే కిరణాల సముద్రపునీటిపై పడి శక్తివంతమవుతాయిని సర్వరోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం.